క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు రాజమహేంద్రవరానికి చెందిన నందూరి సంతోష్, అనంత దంపతులు ఆదివారం రూ.10,002 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. దాత కుటుంబానికి అర్చకులు స్వామి వారి వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

శ్రీకృష్ణుడి భక్తితో తన్మయత్వం



శ్రీకృష్ణమందిర్‌లో శ్రీకృష్ణుని తత్వం బోధిస్తున్న సుందర శ్రీనివాస్ ప్రభూజీ

అయినవిల్లి: శ్రీకృష్ణుడి లీలలు ఒక పట్టాన సామాన్య మానవునికి అర్థం కావని, ఆయన భక్తి తన్మయత్వం చెందిన వారికే అర్థమవుతోందని అయినవిల్లి మండలం నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకులు సుందర శ్రీనివాసాదాస్ ప్రభుజీ అన్నారు. ఆదివారం శ్రీనివాసాదాస్ ప్రభుజీ శ్రీకృష్ణుడు లీలలను వివరించారు. కష్టాల్లో, సుఖాల్లోను అన్నింటా ఆయన్నే భక్తులు స్మరిస్తే నేను ఉన్నాను అంటూ ఆయన ఉద్దరిస్తాడన్నారు. అనంతరం భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి విశేష పూజలు జరిపారు. సంకీర్తనలు ఆలపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నీట మునిగిన వరి చేలు



కట్టుంగలో నీట మునిగిన వరి చేలు

ఆత్రేయపురం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు కుదేలయ్యారు. ఖరీఫ్ సాగు కోసం అరుగాలం కష్టపడి శ్రమించి వేసుకున్న నారుమడులు వర్షపు నీరుకు చెరువులుగా మారాయి. దీంతో వేలాది రూ.వేలు వెచ్చించి ఖరీఫ్ సాగు కోసం నారుమడులకు సమయాత్తమైన అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్ సాగు కోసం రెండు రోజులుగా మండలంలో రైతాంగం నారుమడులు వేసి విత్తనాలు వెదజల్లారు. మరునాడే వర్షాలు ప్రారంభం కావడంతో నారుమడులు ఎందుకు కొరగాకుండా పోయాయి. మండలంలోని సుమారు 5500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అధిక ధరలు చెల్లించి 25 కేజీలు ఒక్కంటికి రూ.2 వేలు చొప్పున కొనుగోలు చేసి నారుమడులు వేయగా విత్తనాలు మొలకలు తిరగబడి అవి ధ్వంసమయ్యాయి. తిరిగి నారుమడులు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కట్టుంగ–తాడిపూడి మురుగుకాలువ వద్ద ఉన్న కాలువ పూడిక తీత ఏర్పడటంతో ముంపు నీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో ముంపు నీరు బయటకు వెళ్లక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పంట చేలు అన్ని నీటిలో మునిగాయి. అధికారులు పరిశీలించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

రోగికి ఆర్థిక సాయం

పి.గన్నవరం: మండలంలోని ముంజవరపు కొట్టు గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న ఎస్.వెంకట సత్యనారాయణకు లక్కవరం గ్రామానికి చెందిన లిటిల్ హార్ట్స్ సేవా యూత్ సభ్యులు ఆదివారం రూ.10 వేల సాయం అందించారు. యూత్ సభ్యులు బోనం దుర్గాప్రసాద్, మేడిచర్ల మెహర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు నల్లా పెదకాపు, బోనం రాజు, సాగిరెడ్డి గణేష్, గుండాబత్తుల హేమ సుందర్ పాల్గొన్నారు.

వైభవంగా ఆషాఢ మాస జాతర

అమలాపురం టౌన్: స్థానిక హైస్కూలు సెంటరులోని విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మకు ఆషాఢ మాస జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుబ్బాలమ్మ గరగకు జరిగిన పూజా కార్యక్రమానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఆంధ్ర ఆటోవాలా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మోటారు వాహనాల గ్రామ దేవతగా కొలువైన సుబ్బాలమ్మకు ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో ఏటా అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని జిల్లా యూనియన్ అధ్యక్షుడు సత్తిరాజు తెలిపారు. హైస్కూలు సెంటర్ ఆటో యూనిట్ అధ్యక్షుడు రాయుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆషాఢ జాతర మహోత్సవ ఊరేగింపు నిర్వహించారు. ఆషాఢ మాసం నాలుగు వారాలూ పట్టణంలోని అన్ని ఆటో యూనియన్లచే జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, వాసర్ల వెంకన్న, సుబ్బారావు తదితరులు సుబ్బాలమ్మ గరగను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ముమ్మరంగా వరి నాట్లు



మామిడికుదురులో వరి నాట్లు వేస్తున్న కూలీలు



మొసలపల్లిలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న కూలీలు

మామిడికుదురు: మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు సార్వా వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలో 2,784 ఎకరాల విస్తీర్ణంలో సార్వా వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఎంటీయూ–1318, ఎంటీయూ–9558, ఎంటీయూ–1064 రకాలను సాగు చేస్తున్నారు. 90 శాతం ఎంటీయూ–9558 రకం సాగు చేస్తుండగా మిగిలిన పది శాతం ఇతర రకాలు సాగు చేస్తున్నారని మండల వ్యవసాయశాఖాధికారిణి బి.మృదుల తెలిపారు. రైతులు సాగు చేసే సార్వా పంటకు 139 ఎకరాల నారుమడులు అవసరం కాగా 127 ఎకరాల్లో నారుమడులు వేశారన్నారు. ఈ నెలాఖరు నాటికి మొత్తం నాట్లు పూర్తవుతాయని చెప్పారు. కాలువ శివారు ప్రాంతాలకు సాగునీరు చేరడంలో ఆలస్యం కావడమే సాగులో జాప్యానికి కారణమని రైతులు చెబుతున్నారు.

20 శాతం పూర్తి

అంబాజీపేట: వరి నాట్లు నియోజకవర్గ పరిధిలో వేగవంతమయ్యాయి. నారుమడులు సిద్ధం కావడంతో దమ్ములు, వరి నాట్లు పనులు రైతులు ముమ్మరం చేశారు. వ్యవసాయాధికారులు వరి నాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని చెబుతున్నారు. ఈ నెలాఖరుతో పాటు, వచ్చే నెలలోనూ నాట్లు పడే అవకాశం ఉంది. ఇరుసుమండ, మొసలపల్లి, గంగలకుర్రు, చిరతపూడి గ్రామాల్లో వరినాట్లు వేశారు. మిగిలిన గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. కొన్ని గ్రామాల్లో కూలీలతోను, యంత్రాలతోను నాట్లు వేస్తున్నారు. అంబాజీపేట మండలంలో ఇప్పటి వరకు 20 శాతం నాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

స్థలం ఒక పంచాయతీది.. చెత్త వేరే ఊరిది..



అంబాజీపేట ప్రధాన రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

అంబాజీపేట: చెత్తా, చెదారం వేసేందుకు మండలంలో డంపింగ్ యార్డులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే అమలాపురం రూరల్ బండారులంక గ్రామానికి చెందిన చెత్తను తీసుకువచ్చి గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ స్థలంలో వేస్తున్నారు. ప్రధాన రహదారి వెంబడి పీర్మాయిపాలెం, బండారులంక వంతెన వద్ద ఖాళీ స్థలాన్ని బండారులంక వాసులు డంపింగ్ యార్డుగా మార్చేశారు. ఈ స్థలంలో కోళ్లు, చేపల వ్యర్థాలతో పాటు, చెత్త, చెదారం వేయడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసనతో ప్రధాన రహదారిన వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు సర్పంచ్, పంచాయతీ అధికారులు అక్కడ ఉన్న చెత్తా చెదారాన్ని పొక్లెయిన్ సాయంతో తొలగించి, ఇక్కడ చెత్త వేయరాదు అని హెచ్చరిక బోర్డు పెట్టిన పక్క పంచాయతీ వారికి ఇవేమి కనబడటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని బండారులంక పంచాయతీ అధికారులకు తెలియజేసినా ఆ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. నిధులు ఖర్చు పెట్టి స్థలాన్ని శుభ్రం చేస్తే పక్క పంచాయతీ వారు చెత్తవేయడం దారుణమని తక్షణమే దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని రహదారి వెంబడి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోనసీమ బాలోత్సవం విజయవంతం కావాలి



కొత్తపేటలో బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: కోనసీమ బాలోత్సవం (మొదటి పిల్లల పండుగ) పేరిట వచ్చే నెల 10, 11 తేదీల్లో నిర్వహించే కార్యక్రమాలు విజయవంతం కావాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆకాంక్షించారు. జితేంద్ర సేవా ఫౌండేషన్, మనం ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే కోనసీమ బాలోత్సవం బ్రోచర్‌ను ఆదివారం స్థానిక కాపు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే బండారు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బాలోత్సవం అనేది మంచి కార్యక్రమం అని అన్నారు. చిన్నారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దర్నాల రామకృష్ణ, మాజీ సర్పంచ్ చింత విజయకృష్ణమోహన్, మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కముజు వెంకటేశ్వరరావు, కోనసీమ బాలోత్సవం అధ్యక్షుడు కర్రి కాశీ విశ్వనాథం, జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్ర, మనం ట్రస్ట్ చైర్మన్ కె.వీరబాబు, కొత్తపేట శాఖ అధ్యక్షుడు యెందూరి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో వాస్క్యులర్‌ను అరికట్టవచ్చు



అంబాజీపేటలో రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ సోమాచారి

అంబాజీపేట: వంశ పారంపర్యం, అధిక బరువు, నిలబడి పని చేయడం వల్ల వచ్చే వాస్క్యులర్ సమస్యలకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకొంటే అరికట్టవచ్చని హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్క్యులర్ వైద్యుడు సోమాచారి అన్నారు. స్థానిక సత్యసాయి సేవా సమితి, ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అంబాజీపేటలో డాక్టర్ ఢిల్లీబాబు ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సోమాచారి మాట్లాడుతూ వాస్క్యులర్ సమస్య ప్రాణాంతకం కాదని ఎంతో ఇబ్బందికరమైందని పేర్కొన్నారు. కాలి పిక్కల వద్ద ఉండే మజిల్స్‌లో రక్తం ఎక్కువగా నిల్వ ఉండిపోవడం వల్ల రక్తనాళాలు ఉబ్బి ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న డా.జీవీ ప్రవీణ్ ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా లేజర్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని తుని, పెద్దాపురం, సఖినేటిపల్లి, తణుకు తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 200 మంది రోగులు వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో స్థానిక సత్య సాయి సేవా సమితి సభ్యులు తిరువూరి బాబా, మన్యం వర్ధనరావు, పెచ్చెటి సత్యనారాయణ, అడపా ప్రసాద్, మంచాల శేషు, ఎస్.భార్గవి, నిట్టాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



అంతర్వేదిలో శాకంబరి అమ్మవారిగా దర్శనమిచ్చిన గుర్రాలక్క అమ్మవారు



బి.సావరంలో శాకంబరి దేవిగా దర్శనమిచ్చిన వారాహి అమ్మవారు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం పరిధిలోని అశ్వరూఢాంబిక(గుర్రాలక్క) ఆలయంలో ఆదివారం అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం పురస్కరించుకుని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బి.సావరంలో..

రాజోలు: మండలంలోని బి.సావరంలో ఉమా సోమేశ్వర స్వామివారి ఆలయంలో కొలువైన వారాహి అమ్మవారు శాకంబరి దేవిగా ఆదివారం దర్శనమిచ్చారు. నవరాత్రులు అమ్మవారు అలంకరణలో భాగంగా పచ్చి కూరగాయలతో ఆలయ ప్రధాన అర్చకుడు కొత్తలంక వీర వెంకట సత్యనారాయణ ఈ మేరకు అలంకరించారు. ఆలయ కమిటీ తిక్కిశెట్టి కలనల్ కాశి, కుంపట్ల సత్యనారాయణ, కట్టా ప్రభాకర్ రావు, కంచి భాస్కరరావు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు పంచాయతీ పరిధిలోని పితానివారిపాలెంలో వైష్ణవి కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాడం సందర్భంగా మహిళలు ఆదివారం సారె సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ వాకాడ శ్రీను, నగర కన్వీనర్ అర్లపల్లి ముత్యాలరావు, జిల్లా మహిళా కన్వీనర్ యనమదల లక్ష్మి, మండల కన్వీనర్ మట్టా నాగేశ్వర రావు, ధర్మ ప్రచారక్ మేడిశెట్టి నాగభూషణం, మహిళలు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో అందించారు.

కాలిబాటలతో అధిక లాభం

- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు
- ఎకరాకు నాలుగు బస్తాల దిగుబడి అదనం



మొసలపల్లిలో కాలి బాటలతో వరి నాట్లు వేసిన రైతులు

అంబాజీపేట: వరి చేను ఊడ్చిన తరువాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాట వేయడం వలన రైతులకు అధిక ప్రయోజనం ఉంటుంది. పైరు వేరు భాగానికి విస్తారంగా గాలి, సూర్యరశ్మి తగలడం,చీడ, పీడల సమస్య తగ్గడం, ఎరువులు, పురుగు మందులు చల్లే సమయంలో దారి సమస్య తగ్గడంతో పాటు ప్రతీ ఎకరాకు మూడు, నాలుగు బస్తాలు అదనంగా పండి రైతులకు లాభాన్ని కలగజేస్తుంది. దారితో పాటు ప్రతి ఎకరాకు గతంలో చాలా మంది రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించి ఆసక్తి కనబరిచే వారు కాదు. వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు విస్తృతంగా వివరించడంతో రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి పి.గన్నవరంలో 25,382, కొత్తపేటలో 34,706, రాజోలులో 8,650 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్కతాడు తీసుకుని నేను గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున వరి నాట్లు సాగులో ఉన్న వరి చేను తొలగించి పక్కనే పలచగా ఉన్న ప్రదేశంలో నాటు కోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.

ప్రయోజనాలెన్నో..

కాలిబాట వేయడం వలన పేరు మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది. తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకల నివారణకు వీలవుతుంది. తుపాన్లు, భారీ వర్షాలు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది. పైరులో చీడ పీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది.

కాలిబాటలతో అధిక లాభం



ఒక ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చు అవుతుంది. కాని కాలి బాటలు వేయడం వల్ల నాలుగు బస్తాల వరకు అధిక దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై మా సిబ్బందితో రైతులకు అవగాహన కల్పించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

– ఎస్‌జీవీ రామమోహనరావు, ఏడీఏ, అంబాజీపేట

నడిచేందుకు దారేది?



మొసలపల్లి గరువులో అధ్వానంగా ఉన్న రహదారి

అంబాజీపేట: గత ముప్పై ఏళ్లుగా నడిచేందుకు రహదారి లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మొసలపల్లి శివారుగరువు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చినుకుపడితే చెరువులా మారిపోయే ఈ రహదారిలో పయాణించాలంటే ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పడ్డ ఈ మార్గంలో పాఠశాలకు చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగులు, రైతులు నానా కష్టాలు పడాల్సి వస్తుంది. పలుమార్లు రహదారులు నిర్మించాలని అప్పటి ప్రజాప్రతినిధులను, అధికారులను కోరినప్పటికీ పట్టించుకోకుండా గాలికి వదిలేశారని గరువు వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులు నిర్మించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి–216లోని కోరంగి వంతెనపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామన్నపాలెం గ్రామానికి చెందిన పాలెపు ప్రసాద్ కోరంగి నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ప్రసాద్‌ను స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు సైతం స్వల్ప గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు పగులగొట్టి ఆభరణాల చోరీ



జి.అగ్రహారంలో చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా పడిఉన్న వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు

అంబాజీపేట: ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఓ ఇంటి తాళాలను పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగలకుర్రు అగ్రహారానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ రాయుడు సత్యనారాయణమూర్తి తన భార్యతో కలసి వారి కుమార్తె వైద్య పని నిమిత్తం ఈ నెల 8న కాకినాడ వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చి సరికి తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించారు. ఇంటికి ఉన్న మూడు తలుపులకు వేసిన తాళాలను పెకిలించి, లోపల బీరువాను పగులగొట్టారు. అందులో ఉన్న రూ.15 వేల నగదు, 10 గ్రాముల బంగారు ఆభరణాలు, దేవుని మందిరంలో ఉన్న వెండి చెంబు, దేవుని విగ్రహాలు, ఏనుగు బొమ్మలు తదితర 2 కేజీల వెండిని అపహరించుకుపోయారు. జరిగిన సంఘటనను అంబాజీపేట పోలీసులకు వివరించారు. చోరీ జరిగిన ఇంటిని ఎఎస్సై ఎ.సూర్యనారాయణ తన సిబ్బందితో పరిశీలించి, క్లూస్ టీమ్‌ను రప్పించారు. బాధితులు సత్యనారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. చోరీకి జరిగిన సంఘటనపై గ్రామంలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

రహదారి దుస్థితి ఇలా.. ప్రయాణం ఎలా?



పాశర్లపూడిలో జాతీయ రహదారి దుస్థితి ఇది

మామిడికుదురు: ఇది మారు మూల ప్రాంతంలోని రహదారి కాదు. సాక్షాత్తూ కత్తిపూడి–పామర్రు జాతీయ రహదారే. నిత్యం వందల వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామ పరిధిలోని కైకాలపేటలో జాతీయ రహదారి పూర్తిగా దిగబడిపోయింది. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ఇక్కడ ప్రయాణికులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. కేవలం అర కిలోమీటరు మేర రోడ్డు దారుణంగా ఉన్నా దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఈ జాతీయ రహదారిపై ప్రయాణం మొత్తం సేఫ్‌గా ఉన్నా ఇక్కడ మాత్రం ప్రమాదం పొంచి ఉంది. ఒక మాదిరి వర్షానికే ఈ రోడ్డు చెరువును తలపిస్తోంది. రోడ్డుపై భారీగా నీరు నిలిచిపోయి మడుగుగా మారుతోంది. ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ రోడ్డు బాగుందో తెలియని అయోమయ పరిస్థితిలో వాహనదారులు బిక్కు బిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా ఈ రోడ్డు దుస్థితిపై దృష్టి సారించి దీనికి కనీస మరమ్మతులైనా నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రాత్రి పదికే దుకాణాల మూసివేత



అమలాపురంలో రహదారి పక్కన పండ్ల దుకాణాలు



అమలాపురంలో తోపుడు బండ్లపై పండ్లు అమ్ముకుంటున్న చిరు వ్యాపారులు

- పోలీసుల ఆంక్షలతో హోటళ్ల యజమానులు, చిరు వ్యాపారుల ఆవేదన
- శాంతి భద్రతల పరిరక్షణకే నిబంధనలంటున్న పోలీసులు

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దుకాణాలన్నీ రాత్రి 10 గంటలకే మూసివేయాలన్న పోలీసుల ఆంక్షలతో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతి భద్రతల కోసమే ఆ సమయానికి దుకాణాలు మూయించి వేస్తున్నామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. గతంలో అమలాపురం పట్టణంలో రాత్రి పది గంటల దాటిన తర్వాత కూడా వ్యాపారాలు నిర్వహించుకునేవారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలీసుల ఆంక్షలు తెర మీదకు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అమలాపురం పట్టణంతో పాటు జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకుంది. ఎన్నికల ఫలితాలు వెలువడి నెల గడుస్తున్నా చిరు వ్యాపారులపై ఆంక్షలు కొనసాగుతుండడంతో వారు చాంబర్ ఆఫ్ కామర్స్‌లను ఆశ్రయించారు.

వెసులుబాటు కోరుతున్న వ్యాపారులు

రాత్రి పది గంటల సమయంలోనే తమకు బేరాలు అధికంగా ఉంటాయని, వినియోగదారులు ఇళ్లకు వెళుతూ పలు వస్తువులు, ఫుడ్ పార్శిళ్లు తీసుకు వెళుతుంటారని హోటళ్లు, చిరు వ్యాపారాలు చేసే దుకాణదారులు చెబుతున్నారు. అలాగే రాత్రి పది గంటలకు దుకాణం కట్టేయాలంటే కనీసం గంట సమయం ముందు నుంచే పని మొదలుపెట్టాల్సి వస్తుందని హోటళ్ల యాజమానులు చెబుతున్నారు. హోటళ్లలో టేబుళ్ల వద్ద కూర్చున్న కస్టమర్లను సరిగ్గా రాత్రి పది గంటలకు లేచి పొమ్మని చెప్పలేమంటున్నారు. ఈ సమస్యలన్నింటినీ ఇటీవల చాంబర్ ఆఫ్ కామర్స్‌లకు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధుల బృందం పట్టణ సీఐని కలిసి వినతి పత్రం కూడా అందించారు. అయినా పోలీసు అధికారులు శాంతి భద్రతల దృష్ట్యా ససేమిరా అంటున్నారు. రాత్రి పది గంటలైతే చాలు పోలీసులు సైరన్లు మోగిస్తూ వరస పెట్టి దుకాణాలను ముఖ్యంగా హోటళ్లను మూసివేయిస్తున్నారు. పోలీసులు వస్తున్నప్పుడు వ్యాపారులు బెంబేలు పడిపోతూ ఆదరా బాదరాగా దుకాణాలను మూసివేయక తప్పడం లేదు. ఆ సమయంలో వ్యాపారులపై పోలీసులు దురుసుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టణం, రూరల్ మండలంలోని కొన్ని గ్రామాల్లో చిరు వ్యాపారులు 110 మంది వరకూ ఉన్నారు. పెద్ద, చిన్న హోటళ్లు సుమారు 70 వరకూ ఉన్నాయి. ఈ వ్యాపారులే కనీసం మాకు రాత్రి 11 గంటల వరకూ దుకాణాలు తెరుచుకునే వెసులుబాటు ఇవ్వాలని పోలీసులను వేడుకుంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం



శాంతి భద్రతల దృష్ట్యా పట్టణ, పరిసర గ్రామాల్లో దుకాణాలన్నీ రాత్రి 10 గంటలకే మూసి వేయాలి. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదు. ఈ ఆంక్షలను వ్యాపారులందరూ అనుసరించాల్సిందే. వ్యాపారుల వినతిని మా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. అప్పటివరకూ దుకాణాలన్నీ రాత్రి పది గంటలకే మూసి వేయాల్సిందే.

– కె.క్రిస్టోఫర్, పట్టణ సీఐ, అమలాపురం

మానవతా దృక్పథంతో వెసులుబాటు ఇవ్వాలి



పట్టణంలో రోడ్ల చెంత తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు చేసే వ్యాపారులు, చిన్న చిన్న హోటళ్ల విషయంలో పోలీసులు మానవతా దృక్పథంతో వెసులుబాటు ఇవ్వాలి. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామంటూ వ్యాపారుల నుంచి లిఖిత పూర్వక హామీ తీసుకుని ఆంక్షలను ఎత్తివేయాలి. కనీసం రాత్రి 11 గంటల వరకూ వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలి.

– యల్లమిల్లి నాగ సుధా కొండ, వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆజాద్ ఫౌండేషన్, అమలాపురం